సాక్షి
రంగారెడ్డి
శుక్రవారం । 5 । సెప్టెంబర్ । 2025



ప్రమాదంలో పెద్దచెరువు!

చిలుకూరు చెరువు నీటిని దిగువకు వదిలేయడంలో అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. 8లో▸



నిమజ్జన ఘట్టం సాఫీగా..

గణేశ్ ఉత్సవాల్లో కీలక ఘట్టమైన సామూహిక నిమజ్జనం శనివారం హుస్సేన్‌సాగర్‌లో జరుగనుంది. 8లో▸



హామీలు అమలు చేయాలి

దివ్యాంగులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉపేందర్ డిమాండ్ చేశారు. 8లో▸

న్యూస్‌రీల్

ఎఫ్ఎస్‌సీఎస్ సేవలు భేష్

తుర్కయంజాల్ సహకార సంఘాన్ని సందర్శించిన అధికారులు



సహకార సంఘం ఎదుట అధికారుల బృందం

తుర్కయంజాల్: సహకార సమ్మిట్‌లో భాగంగా ఉత్తర్‌ప్రదేశ్ రాష్ట్ర సహకార రిజిస్ట్రార్ అండ్ కమిషనర్ యోగేష్ కుమార్, తమిళనాడు రాష్ట్ర సహకార రిజిస్ట్రార్ అండ్ కమిషనర్ కె.నంత కుమార్‌ల బృందం గురువారం తుర్కయంజాల్ రైతు సేవా సహకార సంఘాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా వారు టిస్కాబ్ వైస్ చైర్మన్, డీసీసీబీ చైర్మన్ కొత్తకుర్మ సత్తయ్యను కలిసి సంఘం పని తీరును అడిగి తెలుసుకున్నారు. సంఘం అభివృద్ధికి చేపడుతున్న చర్యలు, పని విధానం, రైతులకు అందిస్తున్న సేవలను ప్రశంసించారు. అనంతరం ఏక్ పేడ్ మా కా నామ్(అమ్మ పేరుతో ఒక చెట్టు) కార్యక్రమంలో భాగంగా మొక్కలను నాటారు. కార్యక్రమంలో జిల్లా సహకార అధికారి సుధాకర్, సూపరింటెండెంట్ నాగేశ్వరరావు, సీఈఓ రాందాసు తదితరులు పాల్గొన్నారు.

పీజీలో స్పాట్ అడ్మిషన్లు

షాద్‌నగర్‌రూరల్: పట్టణ సమీపంలోని నూర్ ఇంజనీరింగ్ కళాశాల భవనంలో కొనసాగుతున్న గిరిజన సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో ఇంటిగ్రేటెడ్ ఎంఎస్‌సీ మొదటి సంవత్సరంలో 40 సీట్లకు స్పాట్ అడ్మిషన్లు ప్రారంభమయ్యాయని ప్రిన్సిపాల్ డాక్టర్ నీతా పోలె గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఐఎంఎస్‌సీలో అడ్మిషన్ పొందాలనుకునే విద్యార్థినులు ఇంటర్మీడియెట్ ఎంపీసీ, బీపీసీలో 40శాతం మార్కులు సాధించి ఉండాలన్నారు. తమ ఒరిజినల్ సర్టిఫికెట్స్‌తో నేరుగా కళాశాలలో సంప్రదించాలని చెప్పారు. డిగ్రీ ప్రథమ సంవత్సరంలో చేరిన వారు డిగ్రీ, పీజీ పూర్తి చేసుకుంటారని, ఈ అవకాశాన్ని విద్యార్థినులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు 8978942246, 9703441345 ఫోన్ నంబర్లను సంప్రదించాలని వివరించారు.

వలస కూలీ బలవన్మరణం

శంకర్‌పల్లి: జీవితంపై విరక్తి చెందిన ఓ వ్యక్తి బలవన్మరణానికి పాల్పడిన సంఘటన గురువారం మోకిల పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్ఐ కోటేశ్వరరావు తెలిపిన వివరాల ప్రకారం.. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రానికి చెందిన దీపక్ చౌహాన్(21), అను దంపతులు. వీరు నాలుగేళ్ల క్రితం ప్రేమ వివాహం చేసుకున్నారు. అనంతరం బతుకుదెరువు కోసం ఆరు నెలల క్రితం శంకర్‌పల్లి మండలం ప్రొద్దుటూరులోని ప్రగతి రిసార్ట్స్‌లో పనిచేస్తున్నారు. ఇటీవల దీపక్‌కు ఆర్థిక ఇబ్బందులు తలెత్తడంతో, మద్యానికి అలవాటు పడ్డాడు. గురువారం ఉదయం భార్య బయట పనులు చేసుకుంటూ ఉండగా.. దీపక్ రూంలో చున్నీతో ఉరి వేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఇది గమనించి అను రిసార్ట్స్‌లోని అంబులెన్సులో మొయినాబాద్ భాస్కర ఆస్పత్రికి తరలించగా.. వైద్యులు పరిశీలించి, అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. ఘటనపై కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

నిమజ్జనానికి 600 ప్రత్యేక బస్సులు

సాక్షి, సిటీబ్యూరో: ఈ నెల 6వ తేదీన ట్యాంక్‌బండ్‌లో జరిగే గణేశ్ నిమజ్జనం సందర్భంగా ఆర్టీసీ విస్తృత రవాణా ఏర్పాట్లు చేపట్టింది. నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు ట్యాంక్‌బండ్‌కు చేరుకొనేందుకు వీలుగా 600 ప్రత్యేక బస్సులను నడపనున్నట్లు ఆర్టీసీ అధికారులు తెలిపారు. నిమజ్జనానికి తరలివెళ్లనున్న విగ్రహాల మార్గాలను దృష్టిలో ఉంచుకొని బస్సుల నిర్వహణకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఈ మేరకు కాచిగూడ, రాంనగర్ తదితర ప్రాంతాల నుంచి వచ్చే బస్సులను, హయత్‌నగర్, వనస్థలిపురం, ఎల్బీనగర్ తదితర ప్రాంతాల నుంచి వచ్చే బస్సులను హిమాయత్‌నగర్ ఓల్డ్ ఎమ్మెల్యే క్వార్టర్స్ వరకు నడుపుతారు. ఉప్పల్, సికింద్రాబాద్ వైపు నుంచి వచ్చే బస్సులను ఇందిరాపార్కు వరకు అందుబాటులో ఉండేవిధంగా చర్యలు చేపట్టారు. బీహెచ్ఈఎల్, పటాన్‌చెరు, మియాపూర్, కూకట్‌పల్లి తదితర ప్రాంతాల నుంచి నడిచే బస్సులు ఖైరతాబాద్ వరకు రాకపోకలు సాగిస్తాయి. బోడుప్పల్ వైపు నుంచి వచ్చే కొన్ని బస్సులను లిబర్టీ వరకు నడిపేందుకు ఏర్పాట్లు చేసినట్లు అధికారులు తెలిపారు. మెహదీపట్నం వైపు నుంచి వచ్చే వాటిని లక్డీకాపూల్ వరకు నడుపుతారు. నిమజ్జనం వేడుకలు ముగిసే వరకు ఈ బస్సులు అందుబాటులో ఉంటాయి. వీటి నిర్వహణ కోసం ప్రత్యేక సిబ్బందిని ఏర్పాటు చేశారు.

ఈ బస్సుల సమాచారం కోసం ప్రయాణికులు 9959226160, 9959226154 ఫోన్ నెంబర్‌లలో సంప్రదించవచ్చు.

రేషన్.. సంబురం

కొత్త కార్డులకు బియ్యం సరఫరా

- మొదటిసారి తీసుకున్న లబ్ధిదారులు
- సంతోషం వ్యక్తం చేసిన కార్డుదారులు
- రాష్ట్ర ప్రభుత్వానికి ధన్యవాదాలు



కేశంపేట: బియ్యం కోసం వేలిముద్ర వేస్తున్న లబ్ధిదారుడు

యాచారం/కేశంపేట/షాబాద్: దశాబ్ద కాల నిరీక్షణ ఫలించింది. కొత్తగా మంజూరైన రేషన్ కార్డులకు ఈ నెల కోటా కేటాయించారు. ఈ నెల ఒకటో తేదీ నుంచి కొత్త లబ్ధిదారులు రేషన్ బియ్యం తెచ్చుకుంటున్నారు. మొదటి సారి బియ్యం పొందడంతో వారి సంతోషానికి అవధుల్లేకుండా పోయింది. పదేళ్లపాటు నిరీక్షించిన పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు. సీఎం రేవంత్‌రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వానికి అభినందనలు తెలుపుతున్నారు. యాచారం మండలంలో నూతనంగా 1,418 కార్డులు మంజూరు చేశారు. కార్డుదారులకు మొత్తంగా 3,12,927 క్వింటాళ్ల బియ్యం సరఫరా జరిగినట్లు అధికారులు తెలిపారు. కేశంపేట మండలంలో 697 కొత్త కార్డులను అధికారులు మంజూరు చేశారు. వీరికి 465 క్వింటాళ్ల బియ్యం అదనంగా పంపిణీ చేస్తున్నారు. షాబాద్ మండలానికి కొత్తగా 570 రేషన్ కార్డులు మంజూరయ్యాయి. నూతన లబ్ధిదారులకు 12,962 టన్నుల బియ్యం వచ్చింది.



యాచారం: తాడిపర్తిలో లబ్ధిదారులకు సరఫరా చేస్తున్న రేషన్ సన్నబియ్యం

సంతోషంగా ఉంది



నూతన రేషన్ కార్డు మంజూరు కావడం సంతోషంగా ఉంది. గతంలో ఎన్నో సార్లు కార్డు కోసం దరఖాస్తు చేసుకున్నా రాలేదు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో కొత్త రేషన్ కార్డు వచ్చింది. సన్న బియ్యం పంపిణీ చేశారు. పేదలకు సంక్షేమ ఫలాలు అందుతాయని విశ్వాసం ఏర్పడింది.

– చిరంజీవి, లబ్ధిదారుడు, తాళ్లపల్లి, షాబాద్

ఎనిమిదేళ్ల తిప్పలు తీరింది



ఎనిమిదేళ్ల క్రితం వివాహం జరిగింది. అప్పటి నుంచి రేషన్‌కార్డు జారీ కోసం ఎన్నో దరఖాస్తులు ఇచ్చినా స్పందన లేదు. ప్రస్తుతం నా పేరుతో పాటు భర్త, పిల్లల పేర్లతో కొత్త రేషన్‌కార్డు వచ్చింది. బియ్యం సైతం తీసుకున్నాం. చాలా సంతోషంగా ఉంది.

– మమత, గృహిణి, పాపిరెడ్డిగూడ, కేశంపేట

లడ్డూ వేలం రూ.18 లక్షలు

చేవెళ్ల: మండలంలోని మున్సిపాలిటీ వార్డులు, కాలనీలు, గ్రామాల్లో వినాయక నవరాత్రి పూజలు, నిమజ్జనాలు ఘనంగా జరుగుతున్నాయి. గురువారం పలు కాలనీల్లో ప్రతిష్ఠించిన గణనాథులను నిమజ్జనానికి తరలించారు. ఈ సందర్భంగా లడ్డూ వేలం ఆసక్తికరంగా సాగింది. ముడిమ్యాల గ్రామంలో రూ.18 లక్షలకు గోనే మాధవరెడ్డి లడ్డూను వేలంలో దక్కించుకున్నారు. పలుచోట్ల యువత నృత్యాలు ఆకట్టుకున్నాయి.



ముడిమ్యాలలో లడ్డూను వేలంలో దక్కించుకున్న మాధవరెడ్డి

రెవెన్యూ లుక్!



ఇబ్రహీంపట్నం తహసీల్దార్ కార్యాలయం

- పూర్వవైభవం సంతరించుకోనున్న శాఖ
- వీఆర్ఓ, వీఆర్ఏల స్థానంలో గ్రామ పరిపాలనాధికారులుగా భర్తీ
- జిల్లాలో 271 మంది జీపీఓల ఎంపిక
- హర్షం వ్యక్తం చేస్తున్న పూర్వ ఉద్యోగులు

ఇబ్రహీంపట్నం: రెవెన్యూ వ్యవస్థకు పూర్వవైభవం రానుందని క్షేత్రస్థాయి ఉద్యోగులు, ప్రజలు సంబరపడుతున్నారు. ప్రక్షాళన పేరుతో గ్రామాల్లో పనిచేసిన వీఆర్ఏ, వీఆర్ఓలను గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం తొలగించింది. జిల్లాలో సుమారు 277 మంది వీఆర్ఓలు, 800 మంది వీఆర్ఏలు పని లేకుండా కొంత కాలం కూర్చున్నా అనంతరం వివిధ శాఖల్లో వారిని భర్తీ చేశారు. మాతృ సంస్థను వదిలి ఇతర శాఖల్లో పనిచేయలేక పలువురు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. క్షేత్రస్థాయిలో సిబ్బంది లేకపోవడంతో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లపైనే పనిభారం ఎక్కువ అయింది. గ్రామస్థాయిలో ఏదైన సమస్య ఎదురైతే విచారించడం కష్టంగా మారింది. వీఆర్ఓలు లేకపోవడంతో ప్రజలు సైతం అవస్థలు పడాల్సి వచ్చింది. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన అనంతరం రెవెన్యూ వ్యవస్థను గ్రామస్థాయి నుంచి పటిష్ట పరుస్తామని ప్రకటించింది. ఇందులో భాగంగా ధరణి స్థానంలో భూభారతిని తీసుకొచ్చింది. ఇప్పుడు పల్లెల్లో జీపీఓలను నియమించనుంది.

అబ్దుల్లాపూర్‌మెట్ నుంచి అత్యధికం

వివిధ శాఖల్లో పనిచేస్తున్న వీఆర్ఓ, వీఆర్ఏలను తిరిగి గ్రామ పరిపాలనాధికారులుగా నియమిస్తామని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. తిరిగి మాతృసంస్థలోకి వెళ్లాలనుకునే వారికి విద్యార్హతలు, అనుభవం తదితర కొన్ని నియమ నిబంధనలు పెట్టి గ్రామ పరిపాలన అధికారుల నియామకం కోసం పరీక్ష నిర్వహించారు. జిల్లా నుంచి 271 మంది ఎంపికయ్యారు. ఇబ్రహీంపట్నం డివిజన్ నుంచి 81 మంది గ్రామ పరిపాలనాధికారులుగా(జీపీఓ) అర్హత సాధించారు. ఇబ్రహీంపట్నం మండలం నుంచి 14 మంది, అబ్దుల్లాపూర్‌మెట్ నుంచి 18 మంది, యాచారం, మంచాల మండలాల నుంచి 11 మంది చొప్పున, హయత్‌నగర్, మాడ్గుల మండలాల నుంచి ఏడుగురు, ఇతర జిల్లాల నుంచి 13 మంది జీపీఓలుగా ఎంపికయ్యారు.

నేడు నియామక పత్రాల అందజేత

ఎంపికైన జీపీఓలు నగరంలోని మాదాపూర్ హైటెక్స్‌లో శుక్రవారం జరిగే కార్యక్రమంలో నియామక పత్రాలను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా అందుకోనున్నారు. ఇందుకు ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేశారు. జీపీఓలుగా ఎంపికైన వారికి ప్రత్యేక కౌన్సెలింగ్ నిర్వహించి ఆయా గ్రామాల్లో నియమించనున్నారు. దీంతో రెవెన్యూ వ్యవస్థకు గ్రామ స్థాయిలో ఓ అధికారిని నియమించినట్లు అవుతుంది. ఫలితంగా ఆ శాఖకు పూర్వ వైభవం వస్తుందనే ప్రజలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

ప్రత్యేక ధన్యవాదాలు



రెవెన్యూ శాఖకు తిరిగి పూర్వవైభవం రానుంది. క్షేత్రస్థాయిలో ప్రజలకు అందుబాటులో జీపీఓలుంటారు. కింది స్థాయిలోని సమస్యలను గుర్తించడంతో వాటికి పరిష్కారం దొరుకుతుంది. జీపీఓగా నియామకపత్రం అందుకోవడం సంతోషంగా ఉంది. సీఎం రేవంత్‌రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు.

– సుజాత, పూర్వ వీఆర్ఏ

ఏ ప్రాంతానికైనా వెళ్తా



తిరిగి మాతృసంస్థకు వెళుతుండటం ఆనందాన్నిస్తోంది. గతంలో వీఆర్ఓగా పనిచేసి, పరిషత్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్ విధులు చేపట్టాను. రెవెన్యూ విధులకు ఇక్కడి పనికి వ్యత్యాసం ఉంది. ఏ ప్రాంతంలో జీపీఓగా నియమించినా వెళ్లేందుకు సిద్ధంగా ఉన్నా. ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నా.

– యార కృష్ణ, పూర్వ వీఆర్ఓ



తుర్కయంజాల్ మాసబ్ చెరువు వద్ద నిమజ్జనం ఏర్పాట్లను పరిశీలిస్తున్న రాచకొండ సీపీ సుధీర్‌బాబు, సీఐ రవికుమార్, మున్సిపాలిటీ కమిషనర్ అమరేందర్‌రెడ్డి తదితరులు

కార్మికుల సమస్యలు పరిష్కరించండి



సమావేశంలో మాట్లాడుతున్న స్వప్న

మధ్యాహ్న భోజన కార్మికుల సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు స్వప్న

కద్లాల్: తమ సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని మధ్యాహ్న భోజన కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు స్వప్న డిమాండ్ చేశారు. గురువారం మండల కేంద్రంలో సీఐటీయూ ఆధ్వర్యంలో మధ్యాహ్న భోజన కార్మికుల మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మధ్యాహ్న భోజన కార్మికులకు రూ.10 వేతనం చెల్లించాలని కోరారు. ఆరు నెలలుగా వంట గ్యాస్, కోడిగుడ్ల బిల్లులు, వేతనం అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. వెంటనే ప్రభుత్వం స్పందించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం మధ్యాహ్న భోజన కార్మిక సంఘం నూతన మండల కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షురాలిగా బుజ్జమ్మ, గౌరవ అధ్యక్షురాలిగా లక్ష్మమ్మ, ఉపాధ్యక్షురాలుగా బాలమణి, అలివేలు, సభ్యులుగా తదితరులు నియమితులయ్యారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల కన్వీనర్ పెంటయ్య, మధ్యాహ్న భోజన కార్మిక సంఘం జిల్లా సహకార్యదర్శి పద్మ, కార్మిక సంఘం మండల అధ్యక్షురాలు రజియాభేగం తదితరులు పాల్గొన్నారు.

బెస్ట్ టీచర్స్

రాష్ట్ర, జిల్లా స్థాయిలో ఎంపిక

ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రభుత్వం పలువురు టీచర్లకు అవార్డులు ప్రకటించింది. రంగారెడ్డి, వికారాబాద్ జిల్లాలకు చెందిన పలువురు ఉపాధ్యాయులు రాష్ట్ర, జిల్లా స్థాయిలో బెస్ట్ టీచర్లుగా ఎంపికయ్యారు.



రమాదేవి

అబ్దుల్లాపూర్‌మెట్: బండరావిరాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్‌గా విధులు నిర్వర్తిస్తున్న పి.రమాదేవి రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయురాలిగా ఎంపికయ్యారు. 2002లో మహబూబ్‌నగర్ జిల్లా ఆత్మకూర్ మండలం హరిజన్‌వాడ యూపీఎస్‌లో తొలిసారి ఆమె విధుల్లో చేరారు. 2013లో మండల స్థాయి ఉత్తమ ఉపాధ్యాయురాలిగా, 2018లో అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా జిల్లా స్థాయిలో కలెక్టర్ చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. 2019లో బెస్ట్ రిజల్ట్స్ సాధించిన టీచర్‌గా రాష్ట్ర ప్రభుత్వం నుంచి అవార్డు అందుకున్నారు. 2020లో జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయురాలిగా ఎంపికయ్యారు. ప్రస్తుతం రాష్ట్ర స్థాయి బెస్ట్ టీచర్‌గా ఎంపిక కావడం సంతోషంగా ఉందని రమాదేవి పేర్కొన్నారు.

దామరగిద్దలో..



బాలాజీ

చేవెళ్ల: చేవెళ్ల మున్సిపల్ పరిధిలోని దామరగిద్ద ప్రాథమికోన్నత పాఠశాల ఎస్‌జీటీ ఉపాధ్యాయుడు కె.బాలాజీ రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికయ్యారు. 25 ఏళ్లుగా బోధనా వృత్తిలో కొనసాగుతున్న ఆయన ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల భవిష్యత్తే లక్ష్యంగా పనిచేస్తున్నారు. ఎంఆర్‌పీ, డీఆర్‌పీ, ఎస్ఆర్‌పీగా బాధ్యతలు నిర్వర్తించారు. రాష్ట్ర స్థాయిలో పలు అంశాలపై ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చారు. తెలంగాణ స్టేట్ రిసోర్స్ గ్రూప్ మెంబర్‌గా కొనసాగుతున్నారు. రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపిక కావడంపై సంతోషం వ్యక్తం చేశారు.

పేద విద్యార్థులకు సేవ..

హుడాకాంప్లెక్స్: విక్టోరియా మెమోరియల్ పాఠశాలలో పనిచేస్తున్న జి.కళావతి ఉత్తమ ఉపాధ్యాయురాలిగా ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ‘మాది వికారాబాద్ జిల్లా ధారూరు మండలం హరిదాసుపల్లి గ్రామం. తండ్రి పాండు రంగారావు రైల్వేలో స్టేషన్ మాస్టారు. అమ్మ రత్నమ్మ గృహిణి. నేను 1993లో కేంద్రియ విద్యాలయంలో ఉపాధ్యాయురాలిగా చేరా. 1994 జూన్‌లో విక్టోరియా మెమోరియల్ హోమ్ టీచర్‌గా ఎంపికయ్యా. పేద విద్యార్థులకు సేవ చేయడం అదృష్టంగా భావిస్తున్నా. అవార్డుకు ఎంపిక కావడం సంతోషంగా ఉంది’ అన్నారు.

ధారూరు నుంచి ముగ్గురు

ధారూరు: మండలం నుంచి ముగ్గురు టీచర్లు జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికయ్యారు. ధారూరు బాలికల ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న లక్ష్మీనర్సమ్మ, మోమిన్‌కలాన్ ప్రాథమిక పాఠశాల టీచర్ శ్రీనివాస్, నాగసమందర్ పీఎస్ ఉపాధ్యాయురాలు సరిత ఉన్నారు.

కుల్కచర్ల నుంచి రమేశ్..

కుల్కచర్ల: స్థానిక ప్రాథమిక పాఠశాలలో విధులు నిర్వర్తిస్తున్న ఉప్పరి రమేశ్ జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికయ్యారు.

ఫార్మా రోడ్డుకు మోక్షం

- త్వరలోనే మీర్‌ఖాన్‌పేట- యాచారం రహదారి విస్తరణ పనులు
- భూసేకరణ లేకుండానే.. ఉన్న రోడ్డును ఫోర్‌వేగా అభివృద్ధి
- ఎమ్మెల్యే చొరవతో కదిలిన అధికార యంత్రాంగం
- క్షేత్రస్థాయిలో పరిశీలించిన ఆర్అండ్‌బీ ఎస్ఈ



విస్తరించనున్న యాచారం-మీర్‌ఖాన్‌పేట రోడ్డు

యాచారం: ఎన్నో ఏళ్లుగా ఎదురు చూస్తున్న యాచారం-మీర్‌ఖాన్‌పేట రహదారికి ఎట్టకేలకు మోక్షం లభిస్తుంది. ఈ రోడ్డు విస్తరణ పనులు తక్షణమే చేపట్టాలని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ముఖ్యమంత్రి ఆదేశాలతో రాష్ట్ర రోడ్డు, భవనాల శాఖ ఎస్ఈ రవిశంకర్ బుధవారం సాయంత్రం మీర్‌ఖాన్‌పేట నుంచి నస్దిక్‌సింగారం, నందివనపర్తి, మొగుళ్లవంపు గ్రామాల మీదుగా యాచారం మండల కేంద్రం వరకు పర్యటించి రోడ్డును పరిశీలించారు. గత సర్కార్ హయాంలో శ్రీశైలం హైవే కందుకూరు నుంచి నాగార్జునసాగర్ రహదారి యాచారం వరకు 25 కిలోమీటర్ల మేర వంద అడుగుల ఫార్మా రోడ్డు విస్తరణ చేపట్టాలని భావించారు. టీజీఐఐసీ నుంచి దాదాపు రూ.వంద కోట్లకు పైగానే నిధులు మంజూరు చేశారు. కందుకూరు నుంచి మీర్‌ఖాన్‌పేట వరకు రోడ్డును విస్తరించారు. కానీ మీర్‌ఖాన్‌పేట నుంచి యాచారం వరకు విస్తరణ చేపట్టలేదు. తాజాగా ఎమ్మెల్యే చొరవతో కదలిక మొదలైంది.

మళ్లీ రీ సర్వే

మీర్‌ఖాన్‌పేట-యాచారం వరకు 12 కిలోమీటర్ల మేర రోడ్డు విస్తరణకు అధికారులు మళ్లీ రీ సర్వే చేపట్టనున్నారు. గతంలో నందివనపర్తి, నస్దిక్‌సింగారం, మొగుళ్లవంపు గ్రామాల మీదుగా కాకుండా బైపాస్‌గా తీసుకెళ్లాలని సర్వే చేశారు. మీర్‌ఖాన్‌పేట గ్రామం నుంచి సాగర్ హైవే తిరుమలనాథ దేవస్థానం వరకు విస్తరణ చేపట్టాలని, ఇందులో 70 మందికి చెందిన రైతుల వంద ఎకరాలకు పైగా వ్యవసాయ భూమి పోతుందని సర్వేలో నిర్ధారించారు. పరిహారం చెల్లింపు విషయంలో అధికారులు చొరవ తీసుకోకపోవడంతో అన్నదాతలు భూములివ్వడానికి మొండికేశారు. దీంతో ఐదేళ్లుగా ఈ రోడ్డు విస్తరణకు గ్రహణం పట్టింది. ఆర్అండ్‌బీ ఎస్ఈ రవిశంకర్ మళ్లీ రీ సర్వే చేసి నివేదిక ఇవ్వాలని అధికారులను ఆదేశించారు.

నాలుగు లైన్లుగా..

ప్రస్తుతం ఉన్న రోడ్డునే నాలుగు లైన్లుగా విస్తరించడానికి ఆర్అండ్‌బీ అధికారులు నిర్ణయించారు. ఈ రహదారి వెడల్పు 66 అడుగులు ఉంది. రోడ్డుకి అటు ఇటు 25 అడుగులు, డివైడర్(మధ్య) కోసం 8 అడుగులు, పాదచారులు, మొక్కల పెంపకం కోసం అటు ఇటు నాలుగు అడుగుల చొప్పున వదులుతారు. మీర్‌ఖాన్‌పేట నుంచి మండల కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తా వరకు నస్దిక్‌సింగారం, నందివనపర్తి, మొగుళ్లవంపు గ్రామాల్లో డబుల్(సీసీ) రోడ్డు, మిగతా చోట్ల నాలుగు లైన్లుగా విస్తరణ చేపడుతారు. ఆయా గ్రామాల్లో రోడ్డు విస్తరణలో ఇళ్లు కూల్చే అవకాశం వస్తే న్యాయపరమైన పరిహారం ఇచ్చేందుకు అధికారులు సుముఖత వ్యక్తం చేశారు.

గతంలో కుట్రలు



అప్పుడు భూసేకరణ ప్రక్రియ అడ్డుకుంటున్నారని రైతులపై తప్పుడు కేసులు నమోదు చేశారు. జైలుకు పంపాలని కుట్రలు చేశారు. నాడు తప్పిదాలు చేసిన అధికారులపై ప్రస్తుత సర్కార్ కేసులు పెట్టాలి. ఏళ్లుగా కోర్టుల చుట్టూ తిరుగుతూనే ఉన్నాం.

– రమేశ్, రైతు, నందివనపర్తి

ఎమ్మెల్యే చొరవ



రోడ్డు విస్తరణ కోసం రూ.5 కోట్లకు పైగా విలువ చేసే ఆరు ఎకరాల వ్యవసాయ భూమిని అప్పట్లో ఇవ్వడానికి సిద్ధమయ్యాం. అధికారులే పరిహారం చెల్లింపులో నిర్ణయం తీసుకోలేదు. ఇటీవల ఎమ్మెల్యే రంగారెడ్డి దృష్టికి తీసుకెళ్లగా మళ్లీ స్పందన వచ్చింది.

– చంద్రశేఖర్‌రెడ్డి, నందివనపర్తి

విస్తరణతో అభివృద్ధి



యాచారం-మీర్‌ఖాన్‌పేట మధ్య నాలుగు లైన్ల రోడ్డు విస్తరణ పనులు త్వరలో ప్రారంభం కానున్నాయి. సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా స్పందించి, అధికారులను ఆదేశించారు. రోడ్డు ఏర్పాటుతో అభివృద్ధి వేగవంతం అవుతుంది. ఆయా గ్రామాల్లో రూ.50 కోట్లతో అభివృద్ధి పనులు చేపడుతున్నాం.

– మల్‌రెడ్డి రంగారెడ్డి, ఎమ్మెల్యే, ఇబ్రహీంపట్నం

ప్రమాదంలో పెద్దచెరువు!



చిలుకూరు పెద్ద చెరువు నుంచి తీసిన కాల్వ ద్వారా దిగువనకు వెళ్తున్న నీరు



నీళ్లు వెళ్లకుండా గురువారం కాల్వను పూడ్చేసిన దృశ్యం

ఎఫ్‌టీఎల్ స్థాయికి మించి అడుగు మేర నిలిచిన నీళ్లు

- అధిక నీటిని దిగువకు వదలడంలో శాఖల మధ్య సమన్వయ లోపం
- ఎగువ నుంచి వస్తున్న వరదతో మరింతగా పెరుగుతున్న నీటి మట్టం

మొయినాబాద్: ప్రమాదకర స్థాయిలో నిండిన చిలుకూరు పెద్ద చెరువులోని నీటిని దిగువకు వదిలేయడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని శిఖం రైతులు, గ్రామస్తులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. ఎఫ్‌టీఎల్‌కు మించి ఒక అడుగు ఎత్తుకు చేరిన నీటిని విడుదల చేయకపోతే ప్రమాదం చోటుచేసుకునే అవకాశం ఉందంటున్నారు. కానీ నీటిని వదిలే విషయంలో మున్సిపల్, ఇరిగేషన్ అధికారుల మధ్య సమన్వయం కొరవడింది. ఎక్కువగా ఉన్న నీటిని కిందికి వదిలేందుకు ఇరిగేషన్ అధికారులు కాలువ తీయగా కొందరు స్థానికులు మూసేశారు. దీంతో ఎగువ నుంచి వస్తున్న వరదతో చెరువు నీటిమట్టం మరింత పెరుగుతోంది. బ్యాక్ వాటర్‌తో ఓ వైపు పంటలు మునుగుతుండగా.. మరోవైపు గ్రామానికి ముప్పు పొంచి ఉంది. అలుగుపై మట్టి పేరుకుపోవడం, కింది భాగంలో రోడ్డు నిర్మించడంతో చెరువులో ఎఫ్‌టీఎల్ స్థాయికి మించి ఒక అడుగు మేర నీరు నిలుస్తోంది. వారం రోజుల క్రితం అడిషనల్ కలెక్టర్ శ్రీనివాస్ చెరువును పరిశీలించి, నీటిని కొద్దికొద్దిగా దిగువకు వదిలేయాలని అధికారులకు సూచించారు. దీంతో నీళ్లు వెళ్లేందుకు బుధవారం ఇరిగేషన్ అధికారులు కాలువ తీశారు. కానీ రాత్రి వేళ కొందరు స్థానికులు కాల్వలో మట్టిపోసి మూసేశారు. ఎగువ నుంచి వస్తున్న నీళ్లతో చెరువులోని నీటి మట్టం ప్రమాదకర స్థాయికి చేరుకుంది. ఈ విషయమై మున్సిపల్ కమిషనర్‌ను అడగగా తమకు సంబంధం లేదని చెబుతున్నారని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అధ్వానరోడ్డుతో అవస్థలు

మరమ్మతు చేయించండి: కమిషనర్‌కు విన్నపం

తుర్కయంజాల్: ఇంజాపూర్– హయత్‌నగర్ అధ్వాన రోడ్డుతో అవస్థలు పడుతున్నామని, వెంటనే మరమ్మతు చేయించాలని పలువురు నాయకులు కోరారు. గురువారం మున్సిపల్ కమిషనర్ కె.అమరేందర్ రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఇటీవల కురిసిన వర్షాలతో రోడ్డు పూర్తిగా ధ్వంసం అయిందని, భారీ వాహనాల రాకపోకలతో గుంతలు ఏర్పడి, ఇబ్బందికరంగా మారిందని పేర్కొన్నారు. దీనికి కమిషనర్ సానుకూలంగా స్పందించారని, త్వరలోనే మరమ్మతులు చేయిస్తానని హామీ ఇచ్చారని వారు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు వంశీధర్ రెడ్డి, రాజు, విజయ్, రాజ్ కుమార్, వేణు గౌడ్ తదితరులు పాల్గొన్నారు.




కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

నిమజ్జన ఘట్టం సాఫీగా సాగేలా..

ఉత్సవం నేపథ్యంలో ట్రాఫిక్ ఆంక్షలు

- నగర వ్యాప్తంగా 66 ప్రాంతాల్లో అమలు
- ఖాళీ వాహనాలు వెళ్లేందుకూ ఓ మార్గం
- సందర్శకుల కోసం పార్కింగ్ ఏర్పాట్లు
- ఉత్తర్వులు జారీ చేసిన కొత్వాల్ ఆనంద్



సాక్షి, సిటీబ్యూరో: గణేష్ ఉత్సవాల్లో కీలక ఘట్టమైన సామూహిక నిమజ్జనం శనివారం హుస్సేన్‌సాగర్‌లో జరుగనుంది. ఈ నేపథ్యంలో భారీ ఊరేగింపులు సైతం ఉంటాయి. వీటి కారణంగా నగర శివార్లతో పాటు సిటీ వ్యాప్తంగా అనేక ప్రాంతాల్లో ట్రాఫిక్ ఆంక్షలు, మళ్లింపులు విధిస్తూ నగర పోలీసు కమిషనర్ సీవీ ఆనంద్ గురువారం ఆదేశాలు జారీ చేశారు. మొత్తం 66 ప్రాంతాల్లో ట్రాఫిక్‌ను మళ్లించడమో, పూర్తిగా ఆపేయడమో చేస్తారు. శనివారం ఉదయం 6 గంటల నుంచి ఆదివారం ఉదయం 6 వరకు ఇవి అమలులో ఉంటాయి. అవసరాన్ని బట్టి వీటిని పొడిగించే అవకాశం ఉంది. నిమజ్జనానికి వచ్చే ప్రజలు వ్యక్తిగత వాహనాలను వదిలి ఆర్టీసీ బస్సులు, ఎంఎంటీఎస్‌లను ఆశ్రయించాలని పోలీసులు విజ్ఞప్తి చేశారు.

ప్రధాన ఊరేగింపు మార్గం:
కేశవగిరి–నాగుల్‌చింత–ఫలక్‌నుమ–చార్మినార్–మదీనా–అఫ్జల్‌గంజ్–ఎంజే మార్కెట్–అబిడ్స్–బషీర్‌బాగ్–లిబర్టీ–అప్పర్ ట్యాంక్/ఎన్టీఆర్ మార్గ్‌ల్లో నిమజ్జనం జరుగుతుంది.

సికింద్రాబాద్ వైపు నుంచి..
ఆర్పీ రోడ్–ఎంజీ రోడ్–కర్బాలామైదాన్–ముషీరాబాద్ చౌరస్తా–ఆర్టీసీ క్రాస్‌రోడ్స్– నారాయణగూడ 'ఎక్స్' రోడ్–హిమాయత్‌నగర్ 'వై' జంక్షన్ ద్వారా వచ్చి లిబర్టీ వద్ద ప్రధాన ఊరేగింపులో చేరుతుంది.

ఈస్ట్‌జోన్ నుంచి..
ఉప్పల్–రామాంతపూర్–అంబర్‌పేట్–ఓయూ ఎన్‌సీసీ–డీడీ హాస్పిటల్‌ల మీదుగా ప్రయాణించి ఆర్టీసీ క్రాస్‌రోడ్స్ వద్ద సికింద్రాబాద్ రూట్ దాంతో కలుస్తుంది.

- వెస్ట్ జోన్ వైపు నుంచి వచ్చే ఊరేగింపు ఎంజే మార్కెట్ లేదా సెక్రటేరియేట్ వద్ద ప్రధాన ఊరేగింపుతో కలుస్తాయి.
- నిమజ్జనం ఊరేగింపు జరిగే మార్గాల్లో చిన్న వాహనాలకు అనుమతి ఉండదు. ఈ మార్గానికి అటు ఇటు ప్రాంతాల్లో ఉన్న వారు ప్రయాణించడానికి కేవలం బషీర్‌బాగ్ చౌరస్తా వద్ద మాత్రమే అవకాశం ఇచ్చారు. సాధారణ ప్రజలు రింగ్‌రోడ్, బేగంపేట్ మార్గాలను ఆశ్రయించడం ఉత్తమం.
- వెస్ట్–ఈస్ట్ జోన్ల మధ్య రాకపోకలు సాగించే వారికి కేవలం బషీర్‌బాగ్ వద్దే అవకాశం ఉంటుంది.

ట్రాఫిక్ డైవర్షన్ పాయింట్స్:

- **సౌత్ జోన్:** కేశవగిరి, మొహబూబ్‌నగర్ ఎక్స్ రోడ్స్, ఇంజన్ బౌలి, నాగుల్‌చింత, హిమ్మత్‌పుర, హరిబౌలి, ఆస్రా హాస్పిటల్, మొఘల్‌పుర, లక్కడ్ కోటి, మదీనా చౌరస్తా, ఎంజే బ్రిడ్జ్, దారుల్‌షిఫా చౌరస్తా, సిటీ కాలేజ్
- **ఈస్ట్ జోన్:** చంచల్‌గూడ జైల్ చౌరస్తా, ముసారాంబాగ్, చాదర్‌ఘాట్ బ్రిడ్జ్, సాలార్జంగ్ బ్రిడ్జ్, అఫ్జల్‌గంజ్, పుత్లిబౌలి చౌరస్తా, ట్రూప్‌బజార్, జాంబాగ్ చౌరస్తా, కోఠి ఆంధ్రా బ్యాంక్
- **వెస్ట్ జోన్:** టోపి ఖానా మాస్క్, అలాస్కా హోటల్ చౌరస్తా, ఉస్మాన్ జంగ్, శంకర్‌బాగ్, శీనా హోటల్, అజంతాగేట్, ఆబ్కారీ లైన్, తాజ్ ఐలాండ్, బర్తన్ బజార్, ఏఆర్ పెట్రోల్ పంప్
- **సెంట్రల్ జోన్:** ఛాపెల్ రోడ్ ఎంట్రీ, జీపీఓ దగ్గరి గద్వాల్ సెంటర్, శాలిమార్ థియేటర్, గన్ ఫౌండ్రీ, స్కైలైన్ రోడ్ ఎంట్రీ, హిమాయత్‌నగర్ 'వై' జంక్షన్, దోమల్‌గూడలోని భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ చౌరస్తా, కంట్రోల్‌రూమ్ దగ్గరి కళాంజలి, లిబర్టీ చౌరస్తా, ఎంసీహెచ్ ఆఫీస్ 'వై' జంక్షన్, బీఆర్‌కే భవన్, ఇక్బాల్ మీనార్, రవీంద్రభారతి, ద్వారకా హోటల్ చౌరస్తా, వీవీ స్టాట్యూ చౌరస్తా, చిల్డ్రన్స్ పార్క్, వైశ్రాయ్ హోటల్ చౌరస్తా, కవాడీగూడ జంక్షన్, కట్టమైసమ్మ టెంపుల్, ఇందిరాపార్క్
- **నార్త్‌జోన్:** కర్బాలామైదాన్, బుద్ధభవన్, సెయిలింగ్ క్లబ్, సెయిలింగ్ క్లబ్, నల్లగుట్ట చౌరస్తా వైపు నుంచి అప్పర్ ట్యాంక్‌బండ్, నెక్లెస్‌రోడ్‌లోకి ఎలాంటి ట్రాఫిక్‌ను అనుమతించరు. శనివారం ఉదయం నుంచి సీటీఓ, వైఎంసీఏ, ప్యారడైజ్ చౌరస్తా, ప్యాట్నీ జంక్షన్, బాటా 'ఎక్స్' రోడ్, ఆదివాసీ చౌరస్తా, ఘాస్‌మండీ చౌరస్తాల మధ్య ఆంక్షలు అమలులో ఉంటాయి.

సందర్శకులకు పార్కింగ్:
హుస్సేన్‌సాగర్‌లో జరిగే నిమజ్జనాన్ని వీక్షించడానికి వచ్చే సందర్శకుల కోసం ప్రత్యేక పార్కింగ్ స్థలాలు కేటాయించారు. ఖైరతాబాద్ ఎంఎంటీఎస్ స్టేషన్, ఆనంద్‌నగర్ కాలనీ నుంచి రంగారెడ్డి జెడ్పీ ఆఫీస్ మధ్య, బుద్ధ భవన్ పక్కన, ఎన్టీఆర్ స్టేడియం, నిజాం కాలేజీ, పబ్లిక్ గార్డెన్స్, ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీర్స్, లోయర్ ట్యాంక్‌బండ్, గోసేవా సదన్, కట్టమైసమ్మ టెంపుల్. ఇక్కడ నుంచి సందర్శకులు కాలినడకనే ట్యాంక్‌బండ్ పరిసరాలకు చేరుకోవాలి.

నిమజ్జనం తరవాత:
విగ్రహాలను తెచ్చిన లారీలు/ట్రక్కులు నిమజ్జనం పూర్తి చేసిన తరవాత తిరిగి వెళ్లేందుకు ప్రత్యేక రూట్లు కల్పించారు. ఎన్టీఆర్ మార్గ్‌లో నిమజ్జనం చేసినవి నెక్లెస్‌రోటరీ, ఖైరతాబాద్ ఫ్లైఓవర్, వీవీ స్టాట్యూ, కేసీపీల మీదుగా వెళ్లాలి. వీటిని తెలుగుతల్లి స్టాట్యూ, మింట్ కాంపౌండ్స్‌లోకి అనుమతించరు. అప్పర్ ట్యాంక్‌బండ్ నుంచి నిమజ్జనం చేసిన లారీలు/ట్రక్కులు చిల్డ్రన్స్‌పార్క్, డీబీఆర్ మిల్స్, కవాడీగూడ, ముషీరాబాద్ మీదుగా వెళ్లాలి. బైబిల్‌హౌస్ రైల్ ఓవర్ బ్రిడ్జ్ మీదుగా అనుమతించరు.

ఇంటర్ డిస్ట్రిక్ట్/స్టేట్ లారీలకు:
ఇతర రాష్ట్రాలు, జిల్లాల నుంచి హైదరాబాద్ వచ్చే లారీలను నగరంలోకి అనుమతించరు. ఔటర్ రూట్లను వినియోగించుకొని వెళ్లాల్సి ఉంటుంది.

ఆర్టీసీ బస్సులకూ:
ట్రాఫిక్ ఆంక్షలు ఆర్టీసీ బస్సులకూ వర్తిస్తాయి. నిమజ్జనం నేపథ్యంలో మాసబ్‌ట్యాంక్, వీవీ స్టాట్యూ, సీటీఓ, వైఎంసీఏ, రెతిఫైల్, సికింద్రాబాద్ రైల్వే స్టేషన్, క్లాక్ టవర్, చిలకలగూడ చౌరస్తా, ఛే నెంబర్, గడ్డిఅన్నారం, చాదర్‌ఘాట్, బహదూర్‌పుర, నల్గొండ చౌరస్తాలను దాటి ముందుకు రానీయరు.

ఇతర రాష్ట్రాలు, జిల్లాల నుంచి వచ్చే బస్సులకు...
నిమజ్జనం పూర్తయ్యే వరకు ఇతర రాష్ట్రాలు, జిల్లాల నుంచి వచ్చే బస్సుల్ని నగరంలోకి అనుమతించరు. వీటిని శివార్లలోనే ఆపేసి అటునుంచే మళ్లిస్తారు.

హెల్ప్‌లైన్స్ ఏర్పాటు:
ఈ ఆంక్షలపై ప్రజలకు అవగాహన కల్పించడం, సహకరించడం కోసం ప్రత్యేక హెల్ప్‌లైన్స్‌ను సైతం ఏర్పాటు చేశారు. ఎలాంటి సహాయం కావాలన్నా 040–27852482, 8712660600, 9010203626 నెంబర్లలో సంప్రదించవచ్చు.

కర్షకుల యూరియా కష్టాలు తీర్చాలి

బీఆర్‌ఎస్ నాయకుల డిమాండ్

ఆమనగల్లు: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులకు అవసరమైన యూరియాను అందించి, ఆదుకోవాలని బీఆర్‌ఎస్ మున్సిపాలిటీ అధ్యక్షుడు పత్యానాయక్ డిమాండ్ చేశారు. గురువారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యూరియా కోసం రైతులు ఇబ్బంది పడుతున్నా ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. యూరియా కొరతకు కారణం మీరంటే మీరంటూ విమర్శలు చేసుకుంటున్నాయని, కానీ రైతుల కష్టాలు తీర్చడం లేదని విమర్శించారు. బీఆర్‌ఎస్ పదేళ్ల పాలనలో వ్యవసాయం పండుగలా సాగిందని, రైతులకు చిన్నకష్టం రానివ్వలేదని గుర్తుచేశారు. రోడ్లన్నీ తానే తెచ్చానని చెప్పుకుంటున్న స్థానిక నాయకుడు ఒకరు.. కేంద్రంతో మాట్లాడి యూరియా తీసుకురావాలని హితవు పలికారు. అనంతరం డీటీ వినోద్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ నిరంజన్‌గౌడ్, మాజీ ఎంపీటీసీ పంతునాయక్, వార్డు మాజీ సభ్యుడు వస్పుల సాయిలు, నాయకులు రమేశ్, మహేశ్, గణేశ్, జగన్, పంతునాయక్, సోమ్లనాయక్, శ్రీకాంత్, గణేశ్ నాయక్, కృష్ణవేణి, లలిత, విమలమ్మ తదితరులు పాల్గొన్నారు.



ధర్నాలో మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ నాయకులు

తాళం వేసిన ఇంట్లో చోరీ

మూడు తులాల బంగారం, 22 తులాల వెండి వస్తువుల అపహరణ

కేశంపేట: దుండగులు తాళం పగులగొట్టి ఇంట్లో చోరీ చేసిన సంఘటన మండల పరిధిలోని అల్వాల గ్రామంలో చోటు చేసుకుంది. పోలీసులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కమ్లీకర్ అంజలి, భర్త పరమేశ్వర్, ఇద్దరు పిల్లలతో కలిసి తన తల్లిగారి ఊరైన కొందుర్గు మండలంలోని ఉత్తరాశిపల్లికి బుధవారం వెళ్లింది. గురువారం ఉదయం ఆమెకు బంధువులు ఫోన్ చేసి తన ఇంట్లో దొంగలు పడినట్లు చెప్పారు. వెంటనే స్వగ్రామంలోని ఇంటికి వచ్చి చూడగా గేటు తెరిచి, మెయిన్ డోర్ తాళం పగిలి ఉంది. బెడ్రూంలోని బీరువా లాకర్‌ను దుండగులు పగులగొట్టి మూడు తులాల బంగారం, 22 తులాల వెండి వస్తువులతో పాటుగా రూ.రెండు వేల నగదును దొంగిలించినట్లు గుర్తించారు. ఇదే విషయమై పోలీసులకు అంజలి ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు ఇన్‌స్పెక్టర్ నరహరి తెలిపారు.



చిందరవందరగా పడి ఉన్న వస్తువులు

ట్రాక్టర్ ఢీకొని పెయింటర్ దుర్మరణం

శంకర్‌పల్లి: ట్రాక్టర్ ఢీకొనడంతో ఓ పెయింటర్ అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటన గురువారం మోకిల పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్ఐ కోటేశ్వరరావు తెలిపిన వివరాల ప్రకారం.. ఖమ్మం జిల్లాకు చెందిన శ్రీపాద రామాచారి(35), భాను దంపతులు. వీరు బతుకుదెరువు నిమిత్తం పదిహేనేళ్ల క్రితం హైదరాబాద్ వచ్చి, బాలానగర్‌లో నివాసం ఉంటున్నారు. రామాచారి పెయింటర్‌గా, భాను కూలీ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. శంకర్‌పల్లి మండలం మోకిలలో ఓ భవనానికి పెయింటింగ్ వేస్తున్న రామాచారి బుధవారం తన తమ్ముడు లక్ష్మణ్‌తో కలిసి రాత్రి వరకూ పని చేసి, ఇక్కడే పడుకున్నారు. గురువారం ఉదయాన్నే టిఫిన్ చేసేందుకు బయటకు వచ్చి, తిరిగి వెళ్తుండగా వెనక నుంచి అతివేగంగా వచ్చిన ట్రాక్టర్ రామాచారిని ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చేవెళ్ల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడి భార్య భాను ఫిర్యాదు మేరకు కేసు, నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

ఐక్యతతోనే హక్కులు సాధ్యం

టీయూడబ్ల్యూజేఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సైదులు

కొత్తూరు: హక్కులు, తమ న్యాయపరమైన సమస్యల పరిష్కారం కోసం జర్నలిస్టులు ఐక్యంగా ఉండి పోరాటాలు చేయాలని టీయూడబ్ల్యూజేఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సైదులు పిలుపునిచ్చారు. మండలంలోని ఇన్ముల్‌నర్వలో ఉన్న జేపీదర్గా ఆవరణలో గురువారం నియోజకవర్గ స్థాయి జర్నలిస్టుల సమావేశాన్ని నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. తుక్కుగూడలో ఈ నెల 26న సంఘం మూడో మహాసభలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దీంట్లో భాగంగా దర్గాలో విలేకరులతో కలిసి సన్నాహక సమావేశాన్ని నిర్వహించామన్నారు. బలమైన సంఘం, జర్నలిస్టుల ఐక్యతతోనే సమస్యలు పరిష్కారం అవుతాయన్నారు. సంఘం ఆధ్వర్యంలో జర్నలిస్టుల కోసం భవిష్యత్తులో చేపట్టే కార్యక్రమాలను సభలో చర్చించనున్నట్లు తెలిపారు. తుక్కుగూడలో నిర్వహించే మహాసభలకు నియోజకవర్గం నుంచి అధిక సంఖ్యలో జర్నలిస్టులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సంఘం సభ్యులు సురేష్, శ్రీనివాస్‌చారి, గణేష్, మోహన్‌రెడ్డి, ఖాజాపాషా, డివిజన్ అధ్యక్షుడు రాఘవేందర్‌గౌడ్, నరేశ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా ప్రధాన కార్యదర్శి సైదులు

డీజే వాడిన ఏడుగురిపై కేసు

- పోలీసుల విధులకు ఆటంకం కలిగించారని అభియోగం
- డీజేతో పాటు వాహనం సీజ్
- ఇబ్రహీంపట్నం కోర్టులో అప్పగింత

యాచారం: పోలీసుల విధులకు ఆటంకం కలిగించిన ఏడుగురిపై కేసు నమోదైంది. వివరాలు ఇలా ఉన్నాయి.. యాచారం అనుబంధ గ్రామమైన మొగుళ్లవంపులో బుధవారం రాత్రి హనుమాన్ యూత్ ఆధ్వర్యంలో గణేశ్ నిమజ్జనం నిర్వహించారు. ఈ సందర్భంగా బండ శ్రీనివాస్‌రెడ్డి, గౌరారం లింగారెడ్డి, నందీశ్వర్‌రెడ్డి, రేసు రాము, పట్టణ చంద్రశేఖర్‌రెడ్డి, మూడేడ్ల శ్యాంసుందర్, నాయిని వెంకట్‌రెడ్డి డీజే పెట్టి, ఎక్కువ సౌండ్‌తో రోడ్డుపై రాకపోకలు సాగించే ప్రజలకు ఇబ్బంది కలిగించారు. అడ్డుకున్న పోలీసులతో వాగ్వాదానికి దిగి, వారి విధులకు ఆటంకం కలిగించారు. ఈ విషయమై కేసు నమోదు చేసిన పోలీసులు డీజేతో పాటు వాహనాన్ని సీజ్ చేసి, ఇబ్రహీంపట్నం కోర్టులో అప్పగించినట్లు సీఐ నందీశ్వర్‌రెడ్డి తెలిపారు. వినాయక నిమజ్జన కార్యక్రమంలో డీజేలను వాడొద్దని సూచిస్తున్నా కొంతమంది ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తున్నారని, పద్ధతి మార్చుకోకపోతే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.



మొగుళ్లవంపులో డీజేతో పాటు పోలీసులు స్వాధీనం చేసుకున్న వాహనం

దివ్యాంగుల హామీలు అమలు చేయాలి



మాట్లాడుతున్న ఉపేందర్‌మాదిగ

ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉపేందర్

కొత్తూరు: రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికలకు ముందు దివ్యాంగులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉపేందర్‌మాదిగ డిమాండ్ చేశారు. మండలంలోని ఇన్ముల్‌నర్వలో గురువారం ఎమ్మార్పీఎస్, దివ్యాంగుల పోరాట సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు పెన్షన్లు పెంచని పక్షంలో ఈ నెల 8న రాష్ట్ర వ్యాప్తంగా అన్ని కలెక్టర్ కార్యాలయాల ఎదుట ధర్నా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఎన్నికల ముందు హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత ఏమి పట్టనట్లు వ్యవహరించడం సీఎం రేవంత్‌రెడ్డికి తగదన్నారు. పెన్షన్ల అంశంలో ప్రభుత్వం, సీఎం స్పందించని పక్షంలో ఈ నెల 8న కలెక్టరేట్లు, 12న తహసీల్దార్ కార్యాలయాలు, 20న హైదరాబాద్–విజయవాడ రహదారి దిగ్బంధం చేయడంతో పాటు 21 నుంచి 26 వరకు అన్ని గ్రామ పంచాయతీల్లో ధర్నాలు, 27న రాష్ట్ర వ్యాప్తంగా అన్ని ప్రధాన రహదారులపై ధర్నాలు చేపట్టనున్నట్లు వెల్లడించారు. ప్రభుత్వం ఇప్పటికైనా ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నేతలు కోళ్ల శివ, రావుగళ్ల బాబు, శంకర్‌రావు, పెంటనోళ్ల రవి కుమార్, రవి, రమేశ్, కృష్ణ, అశోక్, శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

యూరియా కలిపిన నీళ్లు తాగి కాడెద్దు మృతి

షాబాద్: యూరియా కలిపిన నీళ్లు తాగి కాడెద్దు మృతి చెందిన ఘటన గురువారం మండల కేంద్రంలో చోటు చేసుకుంది. పశువైద్యాధికారి డాక్టర్ స్రవంతి తెలిపిన వివరాల ప్రకారం.. షాబాద్‌కు చెందిన దొంద్ర కృష్ణకు చెందిన రెండు కాడెద్దులు 25 కేజీల యూరియా కలిపిన నీళ్లు తాగి తీవ్ర అస్వస్థతకు గురయ్యాయి. వెంటనే గమనించిన రైతు చికిత్స నిమిత్తం స్థానిక వెటర్నరీ ఆస్పత్రికి తరలించగా వైద్యం చేస్తుండగానే ఓ ఎద్దు మృతిచెందింది. చికిత్స చేయడం ద్వారా మరో ఎద్దు ప్రాణాలతో బయటపడిందని సిబ్బంది శ్రీకాంత్, కృష్ణమూర్తి, బాలమణి తెలిపారు.



ఎద్దు కళేబరం

హైడ్రా పేరు చెప్పే దళారుల చేతిలో మోసపోవద్దు

హైడ్రా కమిషనర్ రంగనాథ్

సాక్షి, సిటీబ్యూరో: హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్ ప్రొటెక్షన్ ఏజెన్సీ (హైడ్రా) పరిధి విస్తరించి ఉన్న ఓఆర్ఆర్ వరకు ఉన్న ప్రాంతాల్లో నివసించే ప్రజలు ఎలాంటి సమస్యలు ఉన్నా, ఫిర్యాదు చేయాలన్నా నేరుగా తమనే సంప్రదించాలని కమిషనర్ ఏవీ రంగనాథ్ కోరారు. ప్రతి సోమవారం హైడ్రా ప్రధాన కార్యాలయంలో నిర్వహించే ప్రజావాణి ద్వారానూ ఫిర్యాదు చేయవచ్చని సూచించారు. హైడ్రా అధికారులు తమ బంధువులని, మిత్రులని, తమకు బాగా తెలుసంటూ ఎవరైనా చెబితే నమ్మి మోసపోవద్దని హెచ్చరించారు. హైడ్రాకు సంబంధించి ఫిర్యాదులు ఉన్నా తనను సంప్రదించవచ్చని స్పష్టం చేశారు.హైడ్రాకు ఫిర్యాదు చేయాలన్నా, సహాయసహకారాలు కావాలన్నా టోల్‌ఫ్రీ నంబర్ 1070తో పాటు 8712406899 నంబర్‌కు నేరుగా, వాట్సాప్ ద్వారా...8712406901, 9000113667 నంబర్లకు ఫోను చేయడం ద్వారా సంప్రదించవచ్చు.

ప్రాణాల మీదికి తెచ్చిన కరక్కాయ

మన్సూరాబాద్: దగ్గు వస్తుందని రాత్రి నిద్రపోయేటప్పుడు కరక్కాయను బుగ్గన పెట్టుకున్న మహిళ ప్రాణాల మీదకు తెచ్చుకుంది. ఎల్‌బీనగర్ కామినేని వైద్యులు తెలిపిన మేరకు.. ఎల్‌బీనగర్‌కు చెందిన విజేతకు వాతావరణ మార్పులతో దగ్గు వస్తుందని, నిద్రకు ఆటంకం కల్గుతుందని బావించి కరక్కాయను దవడవద్ద ఉంచుకుంది. నిద్రలో పొరపాటున కరక్కాయను మింగేసింది. దీంతో ఆమెకు విపరీతమైన దగ్గు, ఆయాసం, ఊపిరి అందకపోవడంతో కుటుంబసభ్యులు ఎల్‌బీనగర్ కామినేని హాస్పిటల్‌కు తీసుకువచ్చారు. కామినేని హాస్పిటల్ సీనియర్ పల్మానాలజిస్ట్ డాక్టర్ రవీందర్‌రెడ్డి పరిక్షించి కరక్కాయను రెండు ముక్కలుగా చేసి బయటకు తీశారు. దీంతో రోగి ఊపిరితిత్తులు పూర్తిగా తెరుచుకుని ఆరోగ్యం మెరుగుపడటంతో డిశ్చార్జి చేసినట్లు వెల్లడించారు.

మూడు విమానాల రద్దు

శంషాబాద్: సాంకేతిక కారణాలతో ఒకే రోజు మూడు వేర్వేరు విమానాలు రద్దయ్యాయి. వివరాలు ఇలా ఉన్నాయి... హైదరాబాద్ నుంచి తిరుపతి స్పైస్ జెట్ విమానం 2138, హైదరాబాద్ నుంచి శివమొగ్గకు బయలుదేరాల్సిన ఎస్‌జీ2703 విమానాలు సాంకేతిక సమస్యతో రద్దయ్యాయి. దీంతో పాటు దోహా నుంచి హైదరాబాద్ రావల్సిన క్యూఆర్ 936 విమానం కూడా సాంకేతిక కారణాలతో రద్దు చేశారు. దీంతో సంబంధిత విమానాల ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఆయా విమాన ప్రయాణికులకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసినట్లు ఎయిర్‌పోర్టు వర్గాలు వెల్లడించాయి.